శ్రీ జెట్టిగుండ రఘునాథ రెడ్డి

# రెక్కలు లేని పక్షి

"చదువుకో నాయన్న చదువుకో తండ్రీ
చదువుకుంటే నీకు సౌఖ్య మబ్బేను..."

తెలుగు వాచకంలోని యీ పాటని చిట్టిరాజుకి చెబుతున్న వాడల్లా టక్కున ఆగిపోయాడు క్రిష్ణమూర్తి, ఎవరో పీకని గట్టిగా అదిమి పట్టేసినట్టు.

చిట్టిరాజు క్రిష్ణమూర్తి వాళ్లపక్కింటి ధర్మరాజు కొడుకు. ఒకటో తరగతి చదువుకుంటున్నాడు. బడి మొహం ఎలాంటిదో చూచి ఎరుగడు ధర్మరాజు. చదువుకోనందువల్లనే తనకి కూలీ నాలీ చేసుకుని బ్రతకాల్సిన గ్రహచారం పట్టిందని అతడికి ఎంత చింతంటే అంత చింత. నాలు గిండ్లు బిచ్చం ఎత్తైనా సరే తన కొడుకుని పై చదువుల కెక్కించి, పెద్ద ఉద్యోగంలో పెట్టించాలని అతడి ఆశ. అందుకే చిట్టిరాజుని బళ్లో కేశాడు ధర్మరాజు. చదివి యింట్లోనే వున్న క్రిష్ణమూర్తి దగ్గరికి రాత్రుల్లో ప్రైవేటుకి కూడా పంపిస్తున్నాడు చిట్టిగాణ్ణి.

క్రిష్ణమూర్తి బుర్ర పోటెత్తిన సముద్రంలా సంచలించి పోతోంది ...

చదువుకున్న వాళ్లకంతా సుఖం ఎక్కడుంది యీ కాలంలో?

సుఖం సంగతి దేవుడెరుగు కనీసం కడుపుకింత కూటిని కూడా సంపాదించుకోలేని దౌర్భాగ్య స్థితి ఏర్పడుతోందే!

మీసాలు గడ్డాలు వొచ్చాక కూడా తల్లిదండ్రుల గుండెలపై కుంపటిలా వుండాల్సిన ఖర్మ పడుతోందే!

చదువుకుంటే సుఖం వుంది. నిజమే! అయితే అది ఎవరికి?

ఉన్నవాళ్లకే. లేని వాళ్లకి కానే కాదు.

ఈ పాటని ఆ ఉన్నవాళ్ళకి మాత్రమే ప్రత్యేకించి చెప్పాలి.

అలా కాకుండా అందర్నీ ఒకే గాట్లో కట్టేసినట్టుగా ఉన్న వాళ్లని లేనివాళ్లని ఒకటిగా కలిపి చెప్పటం ఎంతవరకు న్యాయం?

లేని వాళ్లకి లేనిపోని ఆశలు నూరిపెట్టడమే కదా?

"పాఠం చెప్పన్నా!" ఆలోచన్లలో పడిన క్రిష్ణమూర్తిని కదిపి తొందరించాడు చిట్టిగాడు.

పాఠం చెప్పటానికి ఏమాత్రం బుద్ధికాలేదు కృష్ణమూర్తికి. వాచకం మూసేసి వాడి చేతికిస్తూ "రేపు చెబుతాలే చిట్టీ ..." అని, యింటికి పంపించేశాడు.

అప్పటికే రాత్రి పడింది. అమృత భాండాన్ని గుటుక్కున మింగిన రావణాసురుడికి మల్లే చీకటి పిశాచి ఆ పల్లెని మింగి నీళ్లు తాగేసింది.

గేదెల్లో పితికిన పాలు పొయ్యిమీద పెట్టి పిడకలు రగిల్చింది క్రిష్ణమూర్తి తల్లి తులశమ్మ.

ఓటి సత్తు గిన్నెలో యింత సంగటికుక్కి చిన్నపిల్ల ముందుకి తోసింది. మట్టిమూకుడులో సంగటి వేసుకుని బయటికి వెళ్ళినదల్లా తిరిగి అలాగే లోపలికి వొచ్చింది.

కిరసనాయిలు వొత్తికి అందడం లేదేమో సీసా దీపం గుప్‌గుప్ మంటోంది. దాని నోట్లో యిన్ని మంచినీళ్లు కొట్టి, "ఏమిట్రా అట్టాగే కూచొండిపోయావ్...లెయ్ మరి—అన్నం తిందువుగానీ..." క్రిష్ణమూర్తిని కేకేసింది తులశమ్మ. అప్పటికది రెండోసారి కాబట్టి ఆమె గొంతుకలో కాస్త విసుగు ధ్వనించకపోలేదు.

"అయ్య తిన్నాడా అమ్మా!" గిన్నె ముందు కూర్చుంటూ అడిగాడు క్రిష్ణమూర్తి.

"మద్దేనం తినిందే అరగలేదంట. వొద్దన్నాడు" అంది, తులశమ్మ.

కుమారుని చదువుకోసం రెక్కలు ముక్కలు చేసుకుని కష్టించడం చేత క్రిష్ణమూర్తి తండ్రి శివయ్యకి గుండెజబ్బు పట్టుకుంది. దానికి తోడు క్రిష్ణమూర్తికి యింకా వుద్యోగం రాలేదనే దిగులు జబ్బు కూడా. ఈ దిగులు జబ్బు అధికమైనప్పుడల్లా అన్నం మానేస్తుంటాడతడు.

తండ్రి దిగులుని తల్చుకుంటుంటే ముద్ద మింగుడు పడలేదు క్రిష్ణమూర్తికి. తల్లి బలవంతంమీద యింత ఎంగిలి పడి లేస్తూ "వొట్టి కడుపుతో ఎట్టా పడుకుంటాడమ్మా, అయ్య? కొంచెం పాలన్నా యిచ్చిరా! ముందే జబ్బు మనిషి" అన్నాడు క్రిష్ణమూర్తి.

"యాడిచ్చి చచ్చేదో! పాలు కూడా వొట్టి పోవొస్తోంది. రెండు లీటర్లు అంటే ముట్టక అవుతోంది. యిట్టైతే ఎట్టా బతికి బట్ట గట్టేదో..." బాధగా నిట్టూర్చి, చట్టిలోని పాలు కొంచెం

గ్లాసులోకి వొంపుకుని, అంతకు అయిదింతల నీళ్లు కలబోసి బయట మంచంమీద దగ్గుతూ పడుకున్న శివయ్య కిచ్చి వొచ్చింది తులశమ్మ.

వొచ్చే పోయే ప్రాణంగా వున్నవాడికి మల్లే వెలుగుతోంది సీసా దీపం. కిరసనాయిలు అయిపోయిందని గొణుక్కుంటూ గబ గబా పక్కలు వేసింది తులశమ్మ.

అందాకా గుప్ గుప్‌మంటున్న ఆ కాస్త దీపం వెలుగు కొండెక్కి చీకట్లో కలిసిపోయింది.

చేతిని తలగడగా పెట్టుకుని, చింకి చాపమీద చీకటి దుప్పటి కప్పుకుని పడుకున్న క్రిష్ణమూర్తి, తన చీకటి బ్రతుకుని నెమరేసు కోసాగేడు ...

* * *

చదువుకో నాయన్నా చదువుకో తండ్రీ

చదువుకుంటే నీకు సౌఖ్య మబ్బేను ...

—యిదే పాట — ఒకప్పుడు — అంటే చిట్టిరాజంత చిన్నప్పుడు బళ్లో పంతుళ్లు చెబుతుంటే చదువుకోవాలని ఎంతో ఉబలాటపడి పోయాడు క్రిష్ణమూర్తి. ఒక్క పంతుళ్లే కాదు సుమా; తల్లిదండ్రులూ, పెద్దలూ, దేశాధినేతలూ అందరూ 'చక చకా చదువుకునేయ్ — టక టక సౌఖ్యం కొట్టేయొచ్చు' అని ఎన్నెన్నో ఆశలు రేకెత్తించారు.

లక్ష రూపాయలు సార్! ఒక లక్ష రూపాయలు!

ఒక్క రూపాయతో లక్ష రూపాయలు కొట్టేయొచ్చు!

ఒకే ఒక రూపాయి మీది కాదనుకుంటే లక్షాధికారి కావొచ్చు!

ఆలసించకండి—అదృష్టం జారిపోతుంది! పోయిన అదృష్టం యీ జన్మలో మళ్లీ రాదు! కొనండి సార్!... ఆంధ్రా లాటరీ టికెట్స్! కర్ణాటక లాటరీ టికెట్స్...తమిళనాడు లాటరీ టికెట్స్..

— లాటరీ టిక్కెట్లు అమ్మేవాడు పిలిచి పిలిచి వూరించి చెబుతున్నాడు.

నీ దగ్గర అర్ధరూపాయి మాత్రమే వుంది. అయినా, లక్షాధికారి అయిపోవాలనే ఆశతో ఎన్నో తంటాలు పడ్డావు. ఆ అర్ధ రూపాయినీ ఎలాగో సంపాదించావు. టికెట్టు కొనుక్కున్నావు. ఇంకేం స్వర్గాన్నే కొనేయొచ్చులే అన్నంత ధీమాగా మురిసిపోతున్నావు. డ్రా ఫలితాలు తెలిశాయి. లక్ష రూపాయల ప్రైజు కాదు గదా, కనీసం కన్సోలేషన్ ప్రైజు కూడా కొట్టలేదు. అప్పుడు నీ మనసెలా వుంటుంది ?

సరిగ్గా దీనికి పోలికగా చెప్పుకోవచ్చు క్రిష్ణమూర్తి బ్రతుకుని.

ఉన్న సెల్లి డబ్బునంతా బంగారం కడ్డీల్లోకి మార్చి భద్రపరచుకున్న షావుకారులా, ఉన్న కాస్త ఆస్తినీ, తల్లిదండ్రుల కష్టాన్నీ కరగదీసి బియ్యే డిగ్రీ రూపంలోకి తెచ్చుకున్నాడు క్రిష్ణమూర్తి.

కాలేజీలో చదువుకుంటున్న కుమారునికి డబ్బు పంపడం కోసం మితిమీరి కష్టించడంచేత క్రిష్ణమూర్తి చదువు అయిపోవడం అవసరంగా యిక లేవలేని జబ్బుతో మంచాన పడ్డాడు శివయ్య.

విల్లమ్ములని చేతబట్టుకుని అరణ్యంలోకి వేటకి బయల్దేరిన వేటగాడిలా బి. ఏ. డిగ్రీ పుచ్చుకుని ఉద్యోగంకోసం బయటి ప్రపంచంలోకి అడుగెట్టాడు క్రిష్ణమూర్తి.

ఎక్కడెక్కడో గాలిస్తున్నాడు.

ఇంతలో కనిపించి అంతలో మాయమైన మాయలేడిలా, ఐదు సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నా ఎంతకూ దొరకడం లేదు ఉద్యోగం!

అసలు యింక ఉద్యోగంచేసే ప్రాప్తం లేదేమో అన్న బెంగ కూడా యీ మధ్యనే ఒకానొక పరిచయస్తుడు చేసిన హితోపదేశం విన్నాక పట్టుకుంది అతనికి.

బాగా ఆన్సర్ చేశామనుకున్న యింటర్వ్యూల్లో సైతం సెలక్ట్ కాలేకపోతుండటం పట్ల తీరని వ్యథకి గురియైన క్రిష్ణమూర్తి, అతడి దగ్గర తన గోడునంతా వెళ్లబోసుకున్నాడు.

"ఈ కాలంలో ఉద్యోగాలకి ఒక్క క్వాలిఫికేషన్ మాత్రమే చాలదు. అదనపు అర్హతలు కూడా వుండాలి." అన్నాడాపరిచయస్తుడు.

"ఏమిటని ?" అడిగాడు క్రిష్ణమూర్తి.

"లంచం, రెకమెండేషన్. యివి లేకుండా ఉద్యోగం సంపాదించుకోవచ్చనుకోవడం ఒట్టి ప్రయాస మాత్రమే!"

"అసలు యింటర్వ్యూలకి హాజరు కావటానికే డబ్బులేదే! యిక లంచం ఎక్కడ నుంచి తేను? రెకమెండేషన్ అంటావా, డబ్బు లేని యీ పేదవాడికి ఎవరు చేస్తారు?" అన్నాడు క్రిష్ణమూర్తి.

"అయితే యీ ఉద్యోగాల ఆశకి నీళ్లువొదిలి నువ్వు హాయిగా యింటి పట్టునే వుండి పొలం గ్రటా దున్నుకోవడం మంచిది." తేల్చి చెప్పేశాడు ఆ పరిచయస్తుడు.

"పొలమా, ఉన్న కాస్తోకూస్తో కూడా ఏనాడో యీచదువుకే తగలేశాను." వాపోయాడు క్రిష్ణమూర్తి బిక్కమొహం వేసి.

"ఇంతకీ మీ కులం ?" అడిగాడా పరిచయస్తుడు.

చెప్పాడు క్రిష్ణమూర్తి.

"ఉన్నత కులమేనే! అయితే ప్రభుత్వం చేస్తున్న ప్రత్యేక సహాయానికి కూడా నీవు పనికిరావు. నా మాట విను నేస్తం, ధన బలం లేకున్నా కండ బలం ఎటూ వుండనే వుంది. సిగ్గు పడకుండా కూలీ నాలీ చేసుకో" ఉపదేశించాడా పరిచయస్తుడు.

శివయ్య కష్టపడి సంపాదించే రోజులు ఎప్పుడోచెల్లిపోయాయి. కుటుంబ భారం నెత్తి మీది కొచ్చాక విర్చి నీళ్లు త్రాగటానికైనా తీరిక లేకుండా చస్తోంది తులశమ్మ. మరి, ఒకరికి నలుగుర్ని పోషిం

చాలి కదా! కోడి కూతతో లేస్తుందామె. పాలు పితకడం, మజ్జిగ చేయడం, నెయ్యి కాచడం — యిలాంటి పన్లన్నీ చేసుకునేసరికి తేటగ తెల్లారిపోతుంది. తర్వాత గబగబా పాల గంప నెత్తిన పెట్టుకుని రెండు మూడు కిలోమీటర్ల దూరంలో వున్న టౌనుకి పోతుంది. అక్కడ యిళ్లిల్లూ తిరిగి అమ్మి, ఏ రోజు నిత్యావసర వస్తువులు ఆరోజు యింటికి తెస్తుంది. ధరలన్నీ చుక్కల లోకంలో దాగుడు మూతలాడుతున్న యీ రోజుల్లో ముష్టి రెండు గేదెల పాల డబ్బు యింత సంసారానికి ఎక్కడ సరిపోతుంది? సరిపోదు. అందుకే ఉపవాసాలతో గడపాల్సిన రోజులు కూడా అప్పుడప్పుడూ వాళ్లకి ఎదురౌతుంటాయి.

ఇంట్లో దుస్థితిని చూస్తుంటే ఆ పరిచయస్తుని హితోపదేశం అక్షరాలా పాటింపతగినదిగా అన్పించింది క్రిష్ణమూర్తికి.

“హవ్వ, నువ్వా! సేద్యం పన్లకి వొస్తావా? నీ మొహం — నీకేమొచ్చుని — మడక పట్టడం వొచ్చా? మోట దోలడం వొచ్చా?” తీసి కట్టుగా మాట్లాడారు కొందరు.

“ఇంత చదివింది మట్టి పిసుక్కోడానికేనటయ్యా? ఏదైనా గవర్నమెంటు పని చూసుకోకుండా ఏమిటిదంతా?” మరి కొందరు దెప్పి పొడిచి, మళ్లీ ఉద్యోగాల మీదికే క్రిష్ణమూర్తిని మళ్లించారు.

చదువుకున్న నేరానికి యిన్నిన్ని బాధలు పడుతున్న క్రిష్ణమూర్తి చదువుకుంటే సౌఖ్యం అబ్బుతుందని ఎలా చెప్పగలడు?

* * *

... తన అప్రయోజకత్వాన్నీ, నానాటికి చెదలు పట్టిపోతున్న కుటుంబ పరిస్థితినీ తల్చుకుంటున్న క్రిష్ణమూర్తికి కంటిమీద రెప్ప వాలడం లేదు. అర్ధరాత్రి అవుతున్నా పడకమీద అటూ ఇటూ పొర్లుతూనే వున్నాడు.

బయట మంచంమీద పడుకున్న శివయ్య దగ్గు, మూల్గులూ అతడి గుండెకి సమ్మెట పోట్లుగా వున్నాయి.

“ఏం శివన్నా! దగ్గు శానా జాస్తి అయిపోయినట్టుందాదే!” అంటూ ఎవరో వొచ్చి పలకరించారు శివయ్యని.

ఎవరది? — చెవులు రిక్కించాడు క్రిష్ణమూర్తి.

“యాణ్ణించి రానడం కోటేసూ! పేట నుంచేనా? యింత రేతిరి దాకా ఆడేం జేస్తుంటివి?” శివయ్య అడిగాడు దగ్గుకుంటూనే.

“అబ్బోనికి యీ పొద్దు యింట్రూ (యింటర్వ్యూ) గదా! ఆడికిపోయుంట్నే. ఆడ్నే చీకటైంది. బస్సులు కూడా లేవు. లారీలో పేటకొచ్చి, ఇంటి కొచ్చేసరికి యీ యేల అయిపోయింది’ చెప్పాడు కోటేసు.

“పోయిన పని ఏమైంది? పండేగదా?” ఆదుర్దాగా అడిగాడు శివయ్య.

“ఆఁ — ఆఁ! పండే అయ్యింది. రెండు వేలు పోస్తేగానీ సెటట్టు కాలేకపోయాడు. పోతే పోయింది ఎదవ రెండు వేలు. అబ్బోడికి పని మాత్రం ఖాయమైంది” ఏదో కైలాసాన్నే డబ్బుతో కొనేసిన వాడిలా సంబర పడిపోతూ అన్నాడు కోటేసు.

రెండు వేలు అనేసరికి అదిరిపడ్డాడు క్రిష్ణమూర్తి. చిన్న ప్యూను ఉద్యోగనికి రెండు వేలు లంచమా?

కోటేసుకొడుకు గోవిందుడు హైస్కూల్లో క్రిష్ణమూర్తితో పాటు చదువుకున్నవాడే! యేడో తరగతి తప్పిపోవడంతో అక్షరంముక్క అబ్బే యోగంలేదని కొడుకుని బడి మాన్పించేశాడు కోటేసు. మేకల్ని వారానికి తోలినట్టుగా ఊరిమీద చక్రవడ్డీల మీద పిడిచి పెట్టిన తన పదివేల రూపాయల రొక్కాన్ని గోవిందుని పరంజేసి ‘జాగ్రత్తగా కాపాడుకో నాయనా! హాయిగా బతికిపోగలవు’ అని హితబోధ చేశాడు కోటేసు. ఏదైనా ఒక ఉద్యోగం వెలగబెట్టాలనే కోరిక యేడాది క్రితమేకల్గింది గోవిందుడికి. ఇప్పటికి ఆకోరిక డబ్బుతో నెరవేరింది.

* * *

“బి. ఏ. చదివానంటున్నావ్, ప్యూన్ ఉద్యోగం చేస్తావా?” క్రిష్ణమూర్తి మాటలని వినీ వినకముందే ఫక్కుమని నవ్వారు ఆఫీసర్ గారు.

“ఏం చేయమంటారు సార్! అంతకన్నా గత్యంతరంలేదు” చేతులు నలుపుకుంటూ దేవుళ్లాడాడు క్రిష్ణమూర్తి.

“లేకపోతే మటుకు? అడిగేవాడికి లేకపోయినా యిచ్చేవాడికన్నా వుండొద్దూ ఇంగితజ్ఞానం!” అంత పెద్ద ఆఫీసరుగారు చిన్న బుచ్చుకున్న మొహంతో కస్సుమన్నారు.

గాలితీసిన ఫుట్‌బాల్ బ్లాడర్‌లా అయిపోయింది క్రిష్ణమూర్తి మొహం. ఏం మాట్లాడాలో తోచక తలొంచుకున్నాడు క్రిష్ణమూర్తి.

“ఇంత దూరం వొచ్చావు పాపం, అప్లికేషన్ ఒకటి పడేసిపో! వీలుచూసుకుని నీకు తగ్గ వుద్యోగమేదైనావుంటే చూస్తాను” తనలో కస్సు బుస్సులాడే స్వభావమేకాదు, సానుభూతి కూడా లేకపోలేదన్నట్టుగా మాట్లాడి, టింగ్‌మని బెల్ వొక్కారు ఆఫీసర్ గారు, యిక క్రిష్ణమూర్తిని వెళ్లిపొమ్మన్నట్టు.

పేడ నీళ్లు మొహాన కొట్టినట్లైంది క్రిష్ణమూర్తికి. బయటి కొచ్చేశాడు.

యేడో తరగతి ఫెయిల్ అయిన గోవిందునికి దొరికిన ప్యూన్ ఉద్యోగం బి. ఏ. చదివిన తనకి దొరక్కపోదనే ఆశతో, ధీమాగా వొచ్చాడు కృష్ణమూర్తి, గోవిందుడు చేరిన ఆఫీసు దగ్గరికే.

ఆ ఆశకూడా నిరాశే అయ్యింది! బి. ఏ. చదివిన నేరానికి ప్యూన్ పోస్టుకి కూడా పనికిరాని వాడయ్యాడు.

దిక్కూ దరీ లేక ప్రవాహంలో కొట్టుకుపోతున్న చీమలా గిలగిలలాడుతూ బస్‌స్టాప్‌కేసి నడుస్తున్నాడు క్రిష్ణమూర్తి.

రాకెట్‌లా వొస్తున్న ఓ స్కూటర్ షడన్‌గా బ్రేకుపడి తన పక్కన ఆగడంతో తలెత్తి అటుగా చూశాడు క్రిష్ణమూర్తి. శ్రీపతి!

"ఏమోయ్ మూర్తీ! బావున్నావా?" సీటుమీదే ఠీవిగా కూర్చొని, కాళ్ళని రోడ్డుకి తన్నిపట్టి పలకరించాడు, శ్రీపతి.

శ్రీపతి పేరుకు తగ్గట్టు శ్రీపతే! అతడు కాలేజీలో క్రిష్ణమూర్తి క్లాస్‌మేట్. అప్పట్లో అతనికి పొట్టపొడిస్తే ఓ అక్షరం ముక్కైనా ఎచ్చేది కాదు. అలాంటివాడు అసలు బి. ఏ. లోకి ఎలా వొచ్చి పడ్డాడో ఆ భగవంతునికే ఎరుక! బి. ఏ.లో రెండు మూడు సార్లు ఫెయిల్ కావడంతో ఒక్క ఆ పట్టణంలోని కాలేజీలమీదనేకాదు, రాష్ట్రంలోని మొత్తం కాలేజీలమీదనే అలిగి బయట ఎక్కడోవున్న ఒకానొక రాష్ట్రంలోకి వెళ్ళిపోయాడు. అక్కడ కాలుమీద కాలేసుకుని ముచ్చటగా మూడేళ్ళుండి యిక్కడి కాలేజీలనంతా సవాల్ చేస్తూ ఒకటికి రెండు డిగ్రీలతో తిరిగి వొచ్చాడు.

"ఏదో అలా వున్నాను, నువ్వెలా వున్నావు? ఏం చేస్తున్నావు?" అని, పరామర్శించేడు క్రిష్ణమూర్తి.

"లెక్చరర్‌గా పని చేస్తున్నానోయ్" అన్నాడు శ్రీపతి.

"ఎక్కడ?" క్రిష్ణమూర్తి ఆశ్చర్యానికి అవధుల్లేవు. అయినా ఆ భావాన్ని ఏమాత్రం బయటికి పొక్కనీకుండా అణచేసుకుని, కుతూహలంగా అడిగేడు.

"ఈ వూళ్ళోనే! ఒన్ యియర్ కావొస్తోంది."

పొట్ట పొడిస్తే ఓ అక్షరం ముక్కైనా రానివాడికి డిగ్రీలతో బాటు లెక్చరర్ గిరీ!

చక్కగా చదువుకునే శక్తిసామర్థ్యాలున్న వాడికేమో డిగ్రీలతోబాటు ఉద్యోగాలకీ లాటరీ!

—ఎంతో బాధగా మూల్గింది క్రిష్ణమూర్తి హృదయం.

అంతా డబ్బు మాయబాబూ, డబ్బుమాయ!

డబ్బుతో కొనలేనిది ఏదీ లేదు!

ఉద్యోగాలనే కాదు, చదువుల్నీ అంగట్లో సరుకులా కొనేయొచ్చు!.........

'ఉన్న వాడిదే రాజ్యంరా
లేనివాడి పని పూజ్యంరా'

—ఆరుద్ర పాట చప్పున గుర్తుకొచ్చింది క్రిష్ణమూర్తికి.

* * *

'అందని పళ్ళు పుల్లన' అని, ఎంతగా ఎగిరి నప్పటికీ లభించని ద్రాక్షపళ్ళని తిట్టిపోసుకుంటూ అభిమానంతో వెళ్ళిపోయింది నక్క.

నక్కకున్నంత అభిమానం సైతం యీ కాలంలో నిరుద్యోగులకి లేకపోవడం చాలా శోచనీయం!

ఉద్యోగాల విషయంలో జరుగుతున్న అన్యాయాలనీ, అవినీతులనీ ఓ ప్రక్క తిట్టుకుంటూనే, మరో ప్రక్క 'అన్యథా శరణం నాస్తి' అని ఆ ఉద్యోగార్జనకోసం భగీరథ ప్రయత్నం చేస్తూనే వున్నాడు క్రిష్ణమూర్తి.

'నిరుద్యోగ టీచర్లంతా అప్లికేషన్లు వేయండహో! ఖాళీలున్నాయెహో!' అంటూ పత్రికా ముఖంగా చాటింపు వేసింది జిల్లా పరిషత్తు కార్యాలయం ఓనాడు.

టౌన్ లైబ్రరీలో పేపరు తిరగేస్తూ ఆ చాటింపు చూసి కూడా, చూడనివాడిలా నిరుత్సాహంగా తిరిగి వొస్తున్నాడు క్రిష్ణమూర్తి.

"ఏమిటయ్యా క్రిష్ణమూర్తీ! యీమధ్య నీ వ్యాసాలేవీ బొత్తిగా పత్రికకి రావడం లేదే! కొంపదీసి రాయడమే మానేశావా ఏమిటి?" అంటూ, బజార్లో కాకతాళీయంగా కన్పించాడు సభాపతి.

సభాపతి జిల్లాలో ఒకానొక ప్రముఖ స్థానిక వారపత్రికాధిపతి.

బి. ఏ. చదువుకునే రోజుల్లో తను స్పెషల్ తెలుగు విద్యార్థి కాబట్టి తెలుగు సాహిత్యంమీదుండే అభిరుచికొద్దీ అప్పుడప్పుడూ సాహిత్య పరమైన వ్యాసాలు రాస్తుండేవాడు క్రిష్ణమూర్తి. వాటినంతా సభాపతి పత్రికకి పంపించేవాడు. ఆ వ్యాసాలు ఎంతో బావున్నాయంటూ తెగ మెచ్చుకుని ప్రచురిస్తుండేవాడు సభాపతి. చదువైనాక కూడా రెండు మూడేళ్ళవరకూ ఒకటి అరా రాసి పంపించేవాడు. ఆపైన అది కూడా లేదు.

"రాయడానికి కావలసినంత ఏకాగ్రత, మనశ్శాంతి ఎక్కడండీ యీ ముష్టి బ్రతుకులో?" అంటూ బ్రతుకుబాటలో తనని ఏమాత్రం ముందుకు పోనివ్వకుండా చుట్టూరా దట్టంగా అలుముకున్న చీకి పొదల్లాంటి స్వంత సమస్యల్ని అతడికి ఏకరువు పెట్టాడు క్రిష్ణమూర్తి. సభాపతి పత్రికా సంపాదకుడు. అంచేత జిల్లాస్థాయి అధికార్ల దగ్గర అంతో యింతో పలుకుబడి వుండకపోదు. ఆ ఉద్దేశంతోనే చిట్టచివర్లో పత్రికలో వొచ్చిన జిల్లా పరిషత్తు అడ్వర్టైజ్‌మెంటు విషయం కూడా అతని చెవిలో వేశాడు క్రిష్ణమూర్తి.

క్రిష్ణమూర్తి మాటలని సాంతం విన్నాక చాలా బాధపడ్డాడు సభాపతి. ఒకటి రెండు రచనలతోనే ఆగిపోయిన క్రిష్ణమూర్తి రచనా వ్యాసంగం పట్లకూడా అతనికి తీవ్రమైన ఆందోళన కలుగకపోలేదు. సభాపతి మంచి ఆలోచనాపరుడేకాదు; లౌకిక జ్ఞానం కూడా బాగా వున్నవాడు. ఐదు పది నిమిషాలపాటు ఆలోచించాక "ఓ పని చేస్తావా క్రిష్ణమూర్తీ!" అన్నాడు సభాపతి.

"ఏమిటి?"

చెప్పాడు సభాపతి. రామబాణంలాంటిదిది. దీనికిక తిరుగులేదని కూడా అన్నాడు.

గుక్కెడు నీళ్లైనా లేక కరువు కాటకాలతో అఘోరిస్తున్న రైతు, హఠాత్తుగా ఆకాశమంతటా వానమబ్బులు దట్టంగా క్రమ్ముకుంటే ఎంతగా సంతోషిస్తాడో అంతగా సంతోషపడిపోయాడు క్రిష్ణమూర్తి.

సభాపతి చెప్పినట్లు తు. చ. తప్పకుండా చేశాడు క్రిష్ణమూర్తి. తన రచనలన్నీ తీసుకుని సభాపతితో పాటు వెళ్లి యింటర్వ్యూకి ముందే సెలక్షన్ కమిటీ మెంబర్లందర్నీ కలిసాడు క్రిష్ణమూర్తి. క్రిష్ణమూర్తి రచనలన్నీ వాళ్లకి చూపెట్టి—తెలుగు పంతుడుగా యితడు అన్నివిధాలా అర్హుడు. ఆ ఉద్యోగానికి రచయితకన్నా మించిన గొప్ప అభ్యర్థి యింకెవరు వుంటారు? యితనికి ఈ విషయంలో అన్యాయం జరగకూడదు. ఏలాగైనా ఉద్యోగం యిచ్చి తీరాల్సిందే!—అన్నట్లు గట్టిగా కమిటీ మెంబర్లకి చెప్పి వొచ్చాడు సభాపతి. ఠానానంటూ వాళ్లుకూడా సభాపతితో ఏకీభవించడం క్రిష్ణమూర్తికి ఎక్కడలేని తృప్తినీ, ఆనందాన్నీ కల్గించింది.

మళ్లీ వొకసారి యింటర్వ్యూలో కమిటీ ముందు తన రచనలన్నీ పెట్టడంతోపాటు, అడిగిన ప్రశ్నల కన్నిటికీ చక్కని సమాధానాలు చెప్పాడు క్రిష్ణమూర్తి.

“ఇక గుండెలమీద చెయ్యి వేసుకుని నిద్రపోవోయ్ క్రిష్ణమూర్తీ! అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాగితం వెతుక్కుంటూ నీ దగ్గరికే వొస్తుంది” అన్నాడు సభాపతి.

ఉద్యోగ లక్ష్మి తన యింటికే వొచ్చి పూలమాల వేసేవాకా ఆగలేకపోయాడు క్రిష్ణమూర్తి. వారం రోజులైనా గడిచాయో లేదో ఆఫీసు దగ్గర్నే ఆ మాలని వేయించుకోవాలనే ఉబలాటంకొద్దీ జిల్లా పరిషత్తు చుట్టూ రోజూ ప్రదక్షిణలు చేయసాగేడు.

ఒకటిన్నర నెల తర్వాత ఫలితాలు నోటీస్ బోర్డులో వేయబడింది.

సూదుల్లాంటి చూపులతో తన పేరుకోసం వెదుకులాడేడు క్రిష్ణమూర్తి.

లేదు! లేనే లేదు!!

ఉప్పెనలో తన సర్వస్వం కొట్టుకుపోతున్న వాడికిమల్లే “నా పేరు...నా పేరు...” అంటూ విలపిస్తూ అక్కడే కుప్పగా కూలిపోయాడు క్రిష్ణమూర్తి.

ఉద్యోగులందరూ హడావుడిగా పరుగున వొచ్చారక్కడికి. మూర్ఛబోయిన క్రిష్ణమూర్తి మొహాన యిన్ని మంచినీళ్లు చిలకరించి పైకి లేవనెత్తారు.

క్రిష్ణమూర్తికి యింటిమొహం చూట్టానికి ఏమాత్రం బుద్ధికాలేదు. మతి చలించిన వాడిలా వీధుల్లో పడ్డాడు.

అతడి గుండెల్లో అగ్ని పర్వతాలు బ్రద్దలవుతున్నాయ్!

సప్త సముద్రాలు పొంగెత్తి ఎగిరెగిరి పడుతున్నాయ్!

ఎవరిమీదనో పగ, కోపం, ద్వేషం...

తనమీద తన డిగ్రీమీద అంతులేని అసహ్యం...

ఈ వ్యవస్థ చీడపట్టిన వృక్షంలా అతని కళ్లముందు నిలబడింది. ఎక్కడ చూచినా పీడపురుగులే! అయ్యయ్యో... పచ్చదనమంతా హరించుకుపోతోందే! కొమ్మ కొమ్మలో, రెమ్మ రెమ్మలో, ఆకు ఆకులో ఆమూలాగ్రం తెగబలిసిపోయిందే చీడ! విశ్వరూపం దాల్చిందే!...

ఎవ్వరూ పట్టించుకోవడం లేదేమిటి?

పట్టించుకుని ముందుకొచ్చిన ఒకటి అరా అలా చప్పబడిపోతున్నారేమిటి?...అంతూపొంతూలేని ఆలోచన్లతో, ఆవేశంతో వీధుల్లో తిరిగి తిరిగి అలసిపోయాడు క్రిష్ణమూర్తి.

నడినెత్తిన సూర్యుడు విప్లవకారుడిలా నిప్పులు కురిపిస్తున్నాడు.

ఇక కదలటానికి శక్తిలేదు బాబూ—అంటూ నోరు బాదుకున్నాయ్ క్రిష్ణమూర్తి కాళ్లు. పిండాకూడు లేకపోతే పీడాబోయె—మా మొహాన యిన్ని మంచినీళ్లైనా కొట్టి పుణ్యం కట్టుకో—అంటూ కడుపులోని ప్రేగులన్నీ ఒక్కసారిగా గోలచేయసాగిన్నై.

ఎదురుగా అల్లంత దూరంలో మున్సిపాలిటీ పార్కు కన్పించేసరికి చకచకా నడిచాడు క్రిష్ణమూర్తి. కొళాయి నీళ్లని కడుపునిండా పట్టించాక ఓ చెట్టు నీడన కూలబడ్డాడు.

“ఎవరు బాబూ నువ్వు?”

పరధ్యానంలో మునిగివున్న క్రిష్ణమూర్తి ఉలిక్కిపడి చూశాడు.

పక్కనే బారెడు దూరంలో కాలుమీద కాలేసుకుని పడుకుని వున్న బిచ్చగాడు!

పిచ్చి నవ్వొకటి క్రిష్ణమూర్తి పెదాలమీద విచ్చుకుంది. “ఎవరైతేనేం గానీ ప్రస్తుతానికి నీలాంటి బిచ్చగాణ్నే. మనిద్దరం వొకటేలే!” అన్నాడు.

ప్యాంటూ, షర్టూ వేసుకుని చదువుకున్నవాడిలా వున్న అతగాడు తనలాంటివాడే అని తెలిసేసరికి—“ఎట్టా బాబూ! నువ్వూ నాలాంటి బిచ్చగాడివేనా?” అని, క్రిష్ణమూర్తి పుట్టుపూర్వోత్తరాలనంతా ఆసక్తిగా గుచ్చి గుచ్చి అడిగాడు బిచ్చగాడు.

“యిప్పుడు చెప్పు, నీకూ నాకూ తేడా ఏమిటి? కాదంటే నువ్వు యిండ్లచుట్టూ తిరుగుతున్నావు. నేను ఆఫీసులచుట్టూ తిరుగుతున్నాను.” తన చరిత్రనంతా చెప్పాక, మునుపటి మాటల్ని సమర్థిస్తూ అన్నాడు క్రిష్ణమూర్తి.

క్రిష్ణమూర్తి విషయమంతా విన్నాక ‘మనిద్దరం వొకటేలే’ అన్న మాటల్ని తల్చుకుంటుంటే బిచ్చగాడికెందుకో చిన్నతనమేసింది.

ఆ పోలిక అన్యాయంగా కూడా తోచింది. "చూడు బాబూ! యీ ముష్టిపాత్రతో ముప్పూటలూ తింటున్నానా, ఎంతో హాయిగా వుంటున్నానా, నా వాళ్ల నెందర్నో లక్షణంగా పోషిస్తున్నాను. మరి నువ్వు ఆ డిగ్రీతో నీ కడుపు కూటిని సైతం సంపాదించుకో లేకున్నావే...నీకూ నాకూ పోలికెక్కడ? మనిద్దరం ఎట్టా ఒక టౌతాం?"

బిచ్చగాడి మాటలకి పుండుమీద కారం చల్లినట్లుగ విల విల్లాడిపోయాడు క్రిష్ణమూర్తి. చదువుకున్న పాపానికి ముష్టివాడి కన్నా హీనమైపోయాడా తను? ఎందుకీ డిగ్రీ? ఎందుకీ వెధవ బతుకు? ఛీ ఛీ!...పది పదిహేను నిమిషాలపాటు ఎన్నో తర్జన భర్జనలు జరిగక చచ్చిపోవాలనే నిర్ణయానికి వొచ్చేశాడు క్రిష్ణమూర్తి.

మెల్లగా కళ్లెత్తి బిచ్చగాని కేసి చూశాడు. గురక తీస్తూ గాఢ నిద్రలో వున్నాడు. చివుక్కున లేచి చెట్టు కొమ్మకి తాడొకటి వేలాడదీసాడు క్రిష్ణమూర్తి. చెట్లోకి చరచరా ఎక్కిపోయాడు. "బాబూ మా గతేం కావాలి? నీమీద పుట్టెడు ఆశలు పెట్టుకున్నామే! మా కష్టాన్నంతా ధారపోసి నిన్ను చదివించామే! మా కిన్ని గంజినీళ్ళు ఉడిగిన కాలంలో పోస్తావనుకున్నామే! మాకంతా అన్యాయం చేసిపోతావా?" దగ్గుకుంటూ తండ్రీ, గుండెలు బాదుకుంటూ తల్లీ—కళ్లలో కన్పించారు. అంతే—ఎలా ఎక్కాడో అలానే చెట్టు దిగేశాడు క్రిష్ణమూర్తి.

చదువుకున్న నేరానికి సుఖంగా చచ్చిపోయే యోగం కూడా లేదని డిగ్రీమీద పట పటా పళ్ళు నూరాడు క్రిష్ణమూర్తి.

*　　*　　*

గాఢంగా ఒక్క కునుకు తీశాక మెల్లగా వొళ్ళు విరుచుకుంటూ లేచాడు బిచ్చగాడు. పక్కన తడిమి చూసుకున్నాడు గదా, తన భిక్షాపాత్ర లేదు! మరి అక్కడేముంది? ఎంత జాణతనం ఒలకబోసినా, తన కడుపూ తన వారి కడుపూ నింపలేని వృద్ధ వేశ్య లాగా—డిగ్రీ!

# రాత్రి మేల్కొన్న మనస్సు

## శ్రీ కె. దినకర్

షామియానాలాగ పరచుకుంది నీలాకాశం
షాండిలీర్ లాగ వెలుగుతోంది తారా నివహం
అగరొత్తుల పొగలాగ అలముకుంది ఎలవెన్నెల
అందం మెరిసిన ఈరాత్రి - ఆనందగాత్రి
నిర్వేదనా శ్రుతుల పదేపదే పలికించిన
నిట్టూర్పుల వీణలు నిదురపోతున్నాయి
ఎదలో మేలుకొన్న ఎలక్ట్రిక్ గిటార్లు
ఆలాపిస్తున్నయి జ్వాలాగీతాలు
జ్ఞాపకాల టేప్‌రికార్డర్‌లోంచి
జాజ్ మ్యూజిక్ మధురంగా వినిపిస్తోంది
గుండెల కొండల్లో ఘనీభవించిన
నిశ్శబ్ద నీహారం కరిగి ప్రవహిస్తోంది
వేయి రసస్రవంతులుగా
కోటి రాగతరంగాలతో
వలపుల తెమ్మెరలకు నయన గవాక్షాల
కలల కర్టెన్లు కదలాడుతున్నాయి
కోరికలే క్రొన్నెత్తుటి
కొవ్వొత్తులై జ్వలిస్తున్నాయి
ఊహల డయాస్‌మీద ఊగుతూ తూగుతూ
కేబరే డేన్సర్‌లాగ గెంతుతోంది మనస్సు.

